క్లుప్తంగా

ఉద్యాన రైతులకు ప్రోత్సాహకాలు అందించాలి

కొల్లిపర: గ్రామాల్లో పనులను అడిగిన కూలీలందరికీ ఉపాధి పనులను కల్పించాలని ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్ ఆదేశించారు. మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సీనియర్ మేట్‌లకు ఎలక్ట్రానిక్ మెజర్‌మెంట్ మానిటరింగ్ సిస్టం ఏ విధంగా ఉపయోగించాలి అన్న అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేని ప్రాంతాల్లో కూలీలకు వంద శాతం పనులు కల్పించాలన్నారు. పండ్లు, పూల తోటల పెంపకానికి ముందుకొచ్చే రైతులను గుర్తించాలన్నారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వారికి వివరించాలని సూచించారు. కూలీలు పని చేసిన ప్రదేశంలో ఎలక్ట్రానిక్ మెజర్‌మెంట్ మానిటరింగ్ సిస్టం ద్వారా కొలతలు ఏ విధంగా తీసుకోవాలి అన్న అంశాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఎ.లక్ష్మీపతి, టెక్నికల్ అసిస్టెంట్ ఎం.రవి, పీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు

తెనాలిఅర్బన్: కుష్ఠు నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని లెప్రా సొసైటీ రాష్ట్ర సమన్వయకర్త రాధిక పేర్కొన్నారు. జాతీయ కుష్ఠు నివారణ పక్షోత్సవాల్లో భాగంగా నందుల పేటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్ఠుకు చికిత్స ఉందని చెప్పారు. తగు జాగ్రత్తలు తీసుకుని మందులు సక్రమంగా వాడుకుంటే అది నయమయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శ్యామ్, సంస్థ ప్రతినిధులు అబ్దుల్ వహీద్ బాషా తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న కుల గణన సర్వే



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుల గణన సర్వే మంగళవారం తెనాలి పట్టణంలో దాదాపు అన్ని వార్డుల్లో కొనసాగింది. వార్డు వలంటీర్లు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు. ఇంటి సభ్యులలో ఒకరి బయోమెట్రిక్ తీసుకున్నారు.

నెహ్రూ నికేతన్ వ్యవస్థాపకులకు సత్కారం



తెనాలి: స్థానిక బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ విద్యా సంస్థ స్వర్ణోత్సవాల్లో భాగంగా మంగళవారం సంస్థ వ్యవస్థాపకులైన దాసరి ప్రకాశరావు–రంగలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్, ఉపాధ్యాయులు, బాలబాలికలు ప్రకాశరావు దంపతులను పూలమాల, జ్ఞాపికలతో సత్కరించారు. యాభై ఏళ్ల క్రితం స్థాపించిన విద్యా సంస్థ స్వర్ణోత్సవాలను జరుపుకోవటం సంతోషంగా ఉందని ప్రకాశరావు చెబుతూ తమకు తోడ్పడిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు చెప్పారు. ఇదే వేదికపై గత పాతికేళ్లుగా నెహ్రూ నికేతన్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. తొలుత బాలురు కవాతు నిర్వహించి, పూలవర్షం కురిపించారు.

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా కోటేశ్వరరావు

తెనాలిటౌన్: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నంది వెలుగు గ్రామానికి చెందిన తోటకూర కోటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి శ్రీనివాసరావు నుంచి మంగళవారం నియామక పత్రం అందుకున్నారు. గతంలో కోటేశ్వరరావు పార్టీ మండల అధ్యక్షుడిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. రైతు సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయనకు పలువురు బీజేపీ నాయకులు, నంది వెలుగు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

మద్యం విక్రేతలపై కేసు నమోదు

తెనాలిరూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై ఎస్ఈబీ అధికారులు కేసులు నమోదు చేశారు. కంచర్లపాలెం, గుడివాడ గ్రామాల్లో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇద్దరు మద్యం విక్రయిస్తుండడాన్ని గుర్తించారు. వారి నుంచి 25 సీసాలు లభించడంతో వాటిని స్వాధీనపరుచుకుని, ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.

పన్నుల వసూలు వేగవంతం

- తెనాలి మున్సిపాలిటీలో ప్రత్యేక బృందాల ఏర్పాటు
- పన్నులు చెల్లించని వారికి నోటీసులు, ఎస్ఎంఎస్‌లు
- వసూలులో మరిన్ని కఠిన చర్యలకు అధికారులు సిద్ధం

మున్సిపాలిటీ పరిధిలో పన్నుల వసూలు ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. మార్చి నెలాఖరు లోపు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించటంతో స్థానిక అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పన్నులు చెల్లించని వారికి నోటీసులిస్తూ.. వారి మొబైల్ ఫోన్లకు మెస్సేజ్‌లు పంపుతున్నారు.



పురసేవ కేంద్రంలో జరుగుతున్న ఇంటిపన్నుల చెల్లింపులు

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలో ఇల్లు, ఖాళీ స్థలం, నీటి పన్నులు, దుకాణాల అద్దె కింద ఏడాదికి సుమారు రూ.17.46 కోట్ల ఆదాయం వస్తుంది. పట్టణ పరిధిలో సుమారు 35,190 నివాస గృహాలకు ఏడాదికి రెండు సార్లు పన్ను విధిస్తుంటారు. పన్నుల రూపంలో ఏటా రూ.15.78 కోట్లు సమకూరుతుంది. ఇప్పటి వరకు రూ.10.72 కోట్ల పన్ను వసూలు చేశారు. ఇంకా రూ.5.06 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. తెనాలి పట్టణంలో 22 మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లున్నాయి. వీటి అద్దె ఏడాదికి రూ.1.68 కోట్లు. ఇప్పటి వరకు రూ.1.22కోట్లు వసూలు చేశారు. మిగిలిన రూ.46 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. ఈ గణాంకాలను పరిశీలిస్తే.. పన్నుల వసూలులో తెనాలి మున్సిపాలిటీ ముందు వరుసలోనే ఉన్నట్లు చెప్పొచ్చు.

వేగవంతం అయిన పన్ను వసూలు

పురపాలక సంఘ పరిధిలోని పన్నుల వసూలుకు అధికారులు వార్డు సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వారు ప్రతి ఇంటికి వెళ్లి సకాలంలో పన్నులు వసూలు చేస్తున్నారు. ఎన్నిసార్లు చెప్పినా స్పందించని యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. అంతటితో ఆగకుండా వారి మొబైల్ ఫోన్లకు మెస్సేజ్‌లు పంపుతున్నారు. అవగాహన కల్పించేలా మైక్ ప్రచారం చేస్తున్నారు. ప్రధాన కూడలిలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సకాలంలో పన్నులు చెల్లించని వారికి రెడ్ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

మార్చి 31లోపు పన్నులు చెల్లించాలి..



తెనాలి పట్టణ పరిధిలోని ఇంటి పన్ను, షాపుల అద్దె వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ప్రతిరోజు బకాయిదారులను కలిసి పన్ను వసూలు చేయాలని ఆదేశించాం. మార్చి 31లోపు పన్నులు చెల్లించాలి. ఆ తర్వాత చెల్లించే వారు అపరాధ రుసుంతో చెల్లించాల్సి ఉంటుంది. అందరూ సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి.

– సోమ శేఖర్ యాదవ్, రెవెన్యూఅధికారి, తెనాలి పురపాలక సంఘం

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్



స్థానికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 32వ వార్డులో మంగళవారం ఉదయం కమిషనర్ బండి శేషన్నతో కలసి ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు పర్యటనల సమయంలో స్థానికులు తెలియజేసిన సమస్యలను నోట్ చేసుకోవడం జరిగిందన్నారు. వాటన్నిటినీ త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రజలు నిరభ్యంతరంగా సమస్యలను తమకు తెలియజేయవచ్చన్నారు. వారి వెంట కౌన్సిలర్లు మొగల్ అహ్మద్ బేగ్, తోట రఘురామ్, ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, మట్లపూడి రాజేశ్వరరావు, ఆర్ఐ మోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అనుపమ, రామచంద్రరావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉచిత కంటి వైద్యపరీక్షలు

తెనాలి: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కోస్తాంధ్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నేత్రాలయ ఐ కేర్ వైద్య నిపుణులు విద్యార్థినులకు కంటి పరీక్షలు చేశారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు మాట్లాడుతూ నేటి రోజుల్లో డిజిటలైజేషన్ కారణంగా చిన్న వయసులోనే కంటి సమస్యలు వస్తున్నాయని గుర్తుచేశారు. వీటిని ముందుగానే గుర్తించగలిగితే ప్రయోజనం ఉంటుందన్న భావనతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంటి చూపు విషయంలో విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సెల్‌ఫోన్, కంప్యూటర్ స్క్రీన్‌పై ఎక్కువసేపు వర్క్ చేయటం మంచిది కాదన్నారు. తగినంత లైటింగ్‌లోనే పుస్తకాలను చదువుకోవాలని చెప్పారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయని శాంతకుమారి విద్యార్థినులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించిన నేత్రాలయ ఐ కేర్ నిర్వాహకులను అభినందించారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఐ కేర్‌కు చెందిన షేక్ సైదావలి, షేక్ సుభాని, డ్రాయింగ్ టీచర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జూదరుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: పేకాటాడుతున్న నలుగురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. అరండల్‌పేట 10వ లైనులో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరి నుంచి రూ.48 వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్

కొల్లిపర: అన్ని పోలింగ్ స్టేషన్‌లలో సౌకర్యాలు కల్పించాలని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధికారులను ఆదేశించారు. అత్తోట, చివలూరు, కొల్లిపర గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను మంగళవారం తహసీల్దారు ఎస్. శ్రీనివాసులతో కలసి ఆయన తనిఖీ చేశారు. ఎన్నికల సమయంలో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌లో భాగంగా జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల వివరాల నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నమోదు సమయంలో ఎలాంటి అవరోధాలున్నా సిబ్బంది వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఆర్ఐ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, ఏఎస్ఓ మనోహర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కోటి నాగకిరణ్ , బీఎల్వోలు పాల్గొన్నారు.



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

క్షణికావేశంతోనే అనర్థాలు

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి టి.లీలావతి

తెనాలిరూరల్: క్షణికావేశంతోనే అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని, నేరాలకు పాల్పడి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి. లీలావతి అన్నారు. తెనాలి సబ్ జైలును మంగళవారం సాయంత్రం ఆమె సందర్శించారు. ఖైదీలకు ఇస్తున్న ఆహారాన్ని, జైలు ఆవరణను, ఖైదీల బ్యారక్‌లను పరిశీలించారు. 18 నుంచి 22 ఏళ్లలోపు వయసున్న ఖైదీలను విచారించారు. మైనార్టీ తీరకుండానే నేరాలకు పాల్పడిన వారిని జువైనల్ హోమ్‌కు తరలించకుండా సబ్ జైలులోనే ఉంచారా అన్న అంశాన్ని విచారించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. గతంలో చేసిన పొరపాట్లను ఇకపై చేయకుండా ఉండేలా జైలులోనే మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. అవసరమైన వారికి సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సలహా అందిస్తామని చెప్పారు. వీరి వెంట రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత, న్యాయ శాఖ సిబ్బంది మహబూబ్ ఉన్నారు.



ఖైదీలకు ఇస్తున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి లీలావతి

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

గుంటూరు మెడికల్: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా అన్నారు. క్యాన్సర్ సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా స్థానిక నల్లపాడు రోడ్డులోని ఫ్యూచర్ ఫోకస్ మహిళ జూనియర్ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం, ఉచిత స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండటం ద్వారా వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చు అన్నారు. క్యాన్సర్ బాధితులకు నేడు అత్యాధునిక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, బాధితులు ఏమాత్రం భయపడకుండా చికిత్స తీసుకోవడం ద్వారా క్యాన్సర్ రహిత జీవితాన్ని కొనసాగించవచ్చన్నారు. యువనారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్, హోప్‌విన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు, ముఖ్యంగా కౌమార దశలో ఉన్న విద్యార్థినులకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, అల్ట్రాసౌండ్ పరీక్షలు చేసి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. తమ సంస్థ అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హోప్‌విన్ హాస్పిటల్ మేనేజర్ సి.హెచ్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



క్యాన్సర్‌పై అవగాహన పోస్టర్లు ప్రదర్శిస్తున్న డాక్టర్ షమా సుల్తానా

ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొంటే చర్యలు

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్- 2024పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల విధులు నిర్వహించాలని, ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొంటే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. జనవరి 22 తరువాత అందిన ప్రతి ఫారాన్ని సూపర్వైజరీ అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి ఆమోదం కోసం ఫార్వర్డు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు తగిన విధంగా అధికారులకు విధులు కేటాయిస్తున్నామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, క్షేత్ర స్థాయి పరిశీలనకు బీఎల్ఓలకు పంపాలని ఆదేశించారు. గత వారం రోజుల కాలంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి 1,143, పశ్చిమ నియోజకవర్గం నుండి 1,645 వివిధ ఫారాలు అందాయని, వాటిని ఆయా బీఎల్ఓలు ఎన్నికల నిబంధనల మేరకు పరిశీలించాలని, సూపర్వైజరీ అధికారులు పర్యవేక్షణ చేస్తారని పేర్కొన్నారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఏఈఆర్ఓలు సిహెచ్.శ్రీనివాస్, డి.వెంకట లక్ష్మి, ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్‌లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ, టీడీపీ నుంచి ఓంకార్, వైఎస్సార్‌సీపీ నుంచి జాన్ బాబు, బీఎస్పీ నుంచి సిహెచ్.వాసు, బీజేపీ నుంచి ఆర్.భాస్కర్‌రావు, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, కాంగ్రెస్ నుండి జాని బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

యువతిని వేధిస్తున్న వ్యక్తి పై కేసు

గుంటూరు ఈస్ట్: యువతి వెంటపడి బెదిరిస్తున్న వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కేవీపీకాలనీకి చెందిన గంజి చిన్నోడు, అదే కాలనీకి చెందిన ఓ యువతిని వెంటపడి వేధిస్తున్నాడు. రెండు రోజుల క్రితం యువతి ఇంటికి వెళుతున్న సమయంలో దారిలో నా వెంట రాకపోతే చంపుతానని బెదిరించాడు. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య సేవల్లో సుల్తాన్(నా)బాద్ యూహెచ్‌సీ భేష్..

- పట్టణ రోగుల ఆరోగ్యానికి పూర్తి భరోసా
- పెరుగుతున్న ఓపీ సేవలు, రక్త, బీపీ, షుగర్ పరీక్షలు
- వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న రోగులు
- వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలు విస్తృతం



తెనాలిఅర్బన్: తెనాలి సుల్తానాబాద్‌లోని డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ పట్టణ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోంది. హాస్పిటల్‌లో వైద్య సేవలను ప్రభుత్వం విస్తరిస్తుండటంతో ఓపీ సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గర్భిణులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రసవం అయ్యే వరకు వైద్యులు అన్ని జాగ్రత్తలు సూచిస్తున్నారు. తెనాలి పట్టణ పరిధిలోని 28, 29, 30, 31, 32 వార్డుల పరిధిలోని పేద ప్రజలకు వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుల్తానాబాద్‌లో డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసింది. హాస్పిటల్ శాశ్వత భవనానికి రూ1.10 కోట్ల నిధులను విడుదల చేసింది. గతేడాది జనవరి 26 నుంచి శాశ్వత భవనం నుంచి వైద్య సేవలను రోగులకు అందిస్తున్నారు. నేడు రోజుకు 30 నుంచి 40 మంది రోగులు ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నారు. ఈ సంఖ్య ఏడాదికి సుమారు తొమ్మిది వేలకు పైగా ఉంది. హాస్పిటల్‌లో రక్త, మూత్ర, గళ్ల పరీక్షలు నెలకు 460 పైగా జరుగుతున్నాయి. ఏడాదికి 4,526 మందికిపైగా ఇక్కడ పరీక్షలు చేయించుంటున్నట్లు అధికారులు చెప్తున్నారు.

గర్భిణుల ఆరోగ్యపైం ప్రత్యేక దృష్టి

అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని ఐదు వార్డుల్లోని గర్భిణులకు సేవలందించేందుకు ఐదుగురు ఏఎన్ఎంలు ఉన్నారు. గర్భిణులను గుర్తించి, వారు ప్రతి నెలా చెకప్‌లు చేయించుకునేలా ఏఎన్ఎంలు పనిచేస్తున్నారు. ఇతర సమస్యలు తలెత్తితే.. జిల్లా వైద్యశాలకు వారిని పంపి చికిత్స అందించేలా చూస్తున్నారు. రక్తహీనత నివారణకు సకాలంలో మందులు అందిస్తున్నారు. బలవర్ధక ఆహారం తీసుకునేలా చైతన్యపరుస్తున్నారు. అన్ని రకాల టీకాలు వేయిస్తున్నారు. ప్రసవం అయ్యే వరకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. కుటుంబ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.



సుల్తానాబాద్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్



పేర్లు నమోదు చేయించుకుంటున్న రోగులు



ఈసీజీ తీస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

వైద్య సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు



పేదలకు అనేక వైద్య సేవలు అందిస్తున్నాం. షుగర్, బీపీ, ఇతర 63 రకాల పరీక్షలు ఇక్కడే చేస్తున్నాం. గర్భిణులకు, బాలింతలకు అవసరమైన టీకాలు, మందులు కూడా అందిస్తున్నాం . స్థానిక ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

–డాక్టర్ యు.మహిత, మెడికల్ ఆఫీసర్, అర్బన్ హెల్త్ సెంటర్.

షుగర్‌కు ఇక్కడే మందులు..



నాకు షుగర్ ఉంది. ఏడాది నుంచి అర్బన్ హెల్త్ సెంటర్‌లో పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకుంటున్నాను. వైద్యులు, సిబ్బంది మాకు అవసరమైన అన్ని సేవలు అందిస్తున్నారు. పరీక్షలు చేసి, రిపోర్ట్‌లు త్వరగా ఇస్తున్నారు. దీంతో త్వరగా చికిత్స పొందే అవకాశం కలుగుతోంది.

–బి.సాంబశివరావు, సుల్తానాబాద్, తెనాలి.

జిల్లా గ్రంథాలయ సంస్థ వార్షిక అంచనా బడ్జెట్‌కు ఆమోదం

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సర అంచనా బడ్జెట్‌కు సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, జేసీ జి.రాజకుమారి ఆమోదం తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో రాజకుమారి అధ్యక్షతన జిల్లా గ్రంథాలయసంస్థ బడ్జెట్‌పై సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.47,72,07,425 సవరణ బడ్జెట్‌తో పాటు 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.61,07,16,262 అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. డీఈఓ పి.శైలజ, డీపీఓ కుసుమ శ్రీదేవి, వయోజన విద్య డెప్యూటీ డైరెక్టర్ బి.జగన్‌మోహన్ రావు, ఐ అండ్ పీఆర్ డెప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రఫీక్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

శతాధిక కవి సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

పాత గుంటూరు: 'పుణ్యభూమి నాదేశం నమో నమామి' శతాధిక కవి సమ్మేళనం ఈ నెల 11వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ సౌత్ జోన్ అధ్యక్షుడు రామరాజు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శ్రీనివాసరావు కార్యాలయంలో సమ్మేళనం పోస్టర్ మంగళవారం ఆవిష్కరించారు. భారత కోకిల సరోజినీ నాయుడు జయంతి పురస్కరించుకొని నేటి యువతలో దేశభక్తిని, తెలుగుభాషపై ఆసక్తిని, పర్యావరణంపై అవగాహన కలిగించేందుకు కార్యక్రమాన్ని విజయవాడంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మల్లెతీగ, నవభారత నిర్మాణ సంఘం, భారతీయ జీవిత బీమా సంస్థ, గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్టు, స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమ నిర్వాహకులు మల్లెతీగ వ్యవస్థాపకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ రోజంతా జరిగే కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పది ఉత్తమ కవితల్ని ఎంపిక చేసి అదే రోజు సాయంత్రం జరిగే సభలో ఒక్కొక్క కవితకు రూ.1116 నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరిస్తామన్నారు. పాల్గొన్న ప్రతి కవికీ జ్ఞాపిక, ప్రశంసాపత్రం ఉంటుందన్నారు.



యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

తెనాలిటౌన్: జనసేన, టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టోలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో మంగళవారం రాత్రి పలువురు డప్పు కళాకారులు జనసేనలో చేరారు. వారికి మనోహర్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలకలూరులో డప్పు కళాకారులకు ప్రత్యేకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, సర్పంచ్ చొప్పర ప్రీతి, గుంటూరు కృష్ణమోహన్, దూళ్ళ వెంకట్రామయ్య, మల్లవరపు ఆనంద్, అనిల్, రఘు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో నాదెండ్ల మనోహర్